

నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I హైదరాబాద్, శనివారం 8 మార్చి 2025 | VIKARABAD



షాద్‌నగర్ పట్టణంలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

### బీఆర్ఎస్ అంటేనే అభివృద్ధి..
## కాంగ్రెస్ అంటే అబద్ధం

- ఎమ్మెల్యే శంకర్, స్థానిక కాంగ్రెస్ నాయకులకు మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సవాల్
- అబద్ధాలు చెప్పడం, ఇష్టానుసారంగా మాట్లాడడమే వారికి తెలుసని వ్యాఖ్య

**వ్యక్తిగత విమర్శలకు దిగడంపై ఆగ్రహం**

షాద్‌నగర్, మార్చి 7 : బీఆర్ఎస్ అంటేనే అభివృద్ధి అని.. కాంగ్రెస్ అంటే అబద్ధమని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. అబద్ధాలు చెప్పడం, ఇష్టానుసారంగా మాట్లాడడం తప్పా చేసిన అభివృద్ధి ఎక్కడో చూపాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి, స్థానిక కాంగ్రెస్ నాయకులకు ఆయన సవాల్ విసిరారు. ఇటీవల కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యే శంకర్ గత బీఆర్ఎస్ సర్కార్‌తోపాటు తన పనితీరును విమర్శించిన నేపథ్యంలో శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో స్థానిక నేతలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజయ్యయాదవ్ మాట్లాడుతూ..కేసీఆర్ హ యాంలో జరిగిన అభివృద్ధిపై కాంగ్రెస్ నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతూ.. వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని, తాను వారిలాగే మాట్లాడాలంటే సంస్కారం అడ్డొస్తున్నదని పేర్కొన్నారు. 65 ఏండ్ల కాంగ్రెస్, టీడీపీ పాలనలో జరిగిన అభివృద్ధి, పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో సాధించిన ప్రగతిపై చర్చ పెడుతామని.. ఎవరి హయాంలో అభివృద్ధి జరిగిందో ప్రజలే తేల్చుతారన్నారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టుపై కనీస అవగాహన లేకుండా మాట్లాడడంపై మండిపడ్డారు. మాజీ సీఎం కేసీఆర్ చెప్పేవరకు లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్ట్ అంటే ఎవరికీ తెలియదని.. ఆనాడు కాంగ్రెస్ నాయకులు, ఇప్పటిపరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆ ప్రాజెక్ట్‌ను నిర్మించొద్దని ధర్నా చేసింది నిజం కదా ? అ ని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా షాద్‌నగర్ నియోజకవర్గానికి రూ. 5.6 వేల కోట్ల నిధులను మంజూరు చేసి టెండర్లను పిలిచారని.. అయితే, ప్రభుత్వం మారడంతో ఆ పనులు మధ్యలోనే ఆగిపోయాయన్నారు. బీఆర్ఎస్ హ యాంలో పాలిటెక్నిక్ కళాశాల మంజూరైతే మా హయాంలోనే మంజూరైందని కాంగ్రెస్ నాయకులు చెప్పుకొంటున్నారన్నారరన్నారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు దాటినా చటాన్‌పల్లి ఆర్వో బీ పనులు ఎందుకు ప్రారంభం కాలేదని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో జరిగిన అభివృద్ధిని శాఖల వారీగా వివరించేందుకు తాను సిద్ధమని స్పష్టం చేశారు. పాత జాతీయ రహదారి విస్తరణకు నిధులను విడుదల చేస్తే, వా టిపై తప్పుడు ప్రచారం చేయడం కాంగ్రెస్‌కే చెల్లిందని ఎద్దేవా చేశారు.

లోవోల్టేజీతోపాటు ఇతర సమస్యలతో అన్నదాతలు ఇబ్బందులకు గురవుతున్నారని వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదన్నారు. సమస్యలు పరిష్కారం కాకుంటే రైతుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈటె గణేశ్, మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్, సీనియర్ నాయకుడు నారాయణరెడ్డి, సహకార సంఘాల మాజీ కార్పొరేషన్ చైర్మన్ రాజావరప్రసాద్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నటరాజన్, మండలాల అధ్యక్షులు లక్ష్మణ్‌నాయక్, మురళీధర్‌రెడ్డి, కృష్ణ, శ్రీధర్‌రెడ్డి, మండలాల నాయకులు పాల్గొన్నారు.

# కాడి వదిలి..కాటికి

### వికారాబాద్ జిల్లాలో 15 నెలల్లో 45 మంది రైతుల బలవన్మరణాలు
### ఇవన్నీ సర్కార్ హత్యలేనంటూ వెల్లువెత్తుతున్న విమర్శలు

- నడిమిట్లనే తనువు చాలిస్తున్న అన్నదాతలు
- కాంగ్రెస్ ప్రభుత్వంలో పెరిగిన ఆత్మహత్యలు
- ఆరుగాలం కష్టపడినా పంటలకు దక్కని మద్దతు ధర
- హామీలనిచ్చి ధోకా చేస్తున్న సర్కార్
- ఏడాది దాటిన తర్వాత రైతు భరోసా సాయం పంపిణీ.. అది కూడా అరకొరే..
- పెట్టుబడి సాయం అందక వ్యాపారులు, ఇతరుల నుంచి అధిక వడ్డీకి అప్పులు

వికారాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ): ఆరుగాలం కష్టపడి పంటలను పండిస్తున్న రైతులు ఆదుకునే వారు లేక..వ్యవసాయం చేయలేక మధ్యలోనే కాడి వదిలేస్తున్నారు. దేశానికి వెన్నెముక అంటూ ప్రసంగాలు చేయడం మినహా వారిని పాలకులు పట్టించుకోకపోవడంతో అప్పులు తీర్చలేక.. కుటుంబాలను పోషించే మార్గం లేకపోవడంతో చాలామంది తనువు చాలిస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయాన్ని బలోపేతం చేసి.. అన్నదాత ఆర్థికంగా ఎదిగేలా తోడ్పాటును అందిస్తే.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎవుసాన్ని నమ్ముకున్న రైతులను నట్టేట ముంచుతున్నది. 15 నెలల కాంగ్రెస్ పాలనలో ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ సక్రమంగా నెరవేర్చకపోవడం చాలామంది రైతుల ఆత్మహత్యలకు కారణమయ్యింది. కేసీఆర్ హయాంలో సీజన్‌కు ముందే రైతుబంధు పెట్టుబడి సాయాన్ని అందించడంతోపాటు అవసరమైన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచితే.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 15 నెలల తర్వాత రైతు భరోసాను అమల్లోకి తీసుకొచ్చినా.. కొద్ది మందికే పెట్టుబడి సాయాన్ని పంపిణీ చేయగా ..మిగిలిన రైతులు పంటల సాగు కోసం వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి అప్పులు చేసిన పరిస్థితులున్నాయి. అదేవిధంగా నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోవడం, సకాలంలో అందని ఎరువులు, విత్తనాలు.. ఎరువుల కోసం క్యూలో నిల్చోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. గత ప్రభుత్వంలో వ్యవసాయానికి 24 గంటల కరెంట్ సరఫరా కాగా.. రేవం త్ సర్కార్ వచ్చాక కరెంట్ కోతలు మొదల య్యాయి. ఇతరుల వద్ద అప్పులు తెచ్చి పంటలను సాగు చేస్తే.. ప్రభుత్వం కనీస మద్దతు ధరను చెల్లించకపోవడం..దిగుబడి సరిగ్గా రాకపోవడంతో అన్నదాతలు అప్పులు చెల్లించే మార్గం లేక పంట పొలాల్లోనే ప్రాణాలు తీసుకుంటున్నారు.

**15నెలల్లో 45 మంది..**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతోనే అన్నదాతలకు కష్టాలు మొదలయ్యాయి. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో వ్యవసా యం పండుగలా మారితే... ఇప్పుడు దండుగాలా మారిపోయింది. కేసీఆర్ హయాంలో అప్పుల కోసం చూడని రైతులు.. ప్రస్తుతం పం టల సాగు కోసం మళ్లీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా రేవంత్ సర్కార్‌లో రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయి. కరెంట్ కోతలు, రైతుభరోసా పెట్టుబడి సాయం అందకపోవడం, పంటలకు మద్దతు రాక రైతులు బలవన్మరణానికి పాల్పడుతున్నారు. 15 నెలల కాంగ్రెస్ పాలనలో జిల్లాలో ఇప్పటి వరకు 45 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబ యజమాని ఆత్మహత్యతో సంబంధిత కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఇవన్నీ ప్రభు త్వ హత్యలేనని ప్రతిపక్షాల నాయకులు, ప్రజలు ఆరోపిస్తున్నారు.


### కుటుంబ పోషణ భారమైంది..



అప్పుల బాధతో నా భర్త బోయిని గోపాల్ ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి కుటుంబ పోషణ భారమైంది. నాకు ఇద్దరు సంతానం. వారికి చదువు చెప్పించేందుకు ఆర్థిక స్తోమత సరిపోవడం లేదు. నా భర్త పేరున 30 గుంటల భూమి ఉన్నది. దాదాపుగా రూ. మూడు లక్షల వరకు అప్పు ఉన్నది. వాటిని తీర్చే మార్గం కనిపించడం లేదు. రైతు బీమాకు దరఖాస్తు చేసుకోగా ప్రాసెస్‌లో ఉందని అధికారులు చెబుతున్నారు. రైతు బీమా డబ్బులు తొందరగా వచ్చేలా చూడాలి.

**-బోయిని మమత కోటమర్పల్లి, మర్పల్లి**

### భర్త మృతితో బతుకు భారంగా..


శ్రీనయ్య భార్య రమాదేవి, కుమారులు (ఫైల్)

కులకచర్ల, మార్చి 7 : భర్త మృతితో బతుకు భారంగా మారిందని వీరాపూర్ గ్రామానికి చెందిన రమాదేవి ఆవేదన వ్యక్తం చేసింది. గతేడాది మార్చిలో వీరాపూర్ గ్రామానికి చెందిన రెబ్బనమోని శ్రీనయ్య అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. చేసిన అప్పులు తీర్చలేక.. కుటుంబాన్ని పోషించలేక తన భర్త తనువు చాలించాడని.. అప్పటి నుంచి కుటుంబ భారం తనపై పడిందన్నారు. కూలీ పనులు చేసుకుంటూ ఇద్దరు కుమారులను చదివిస్తున్నానని చెప్పింది. తమకు మూడు ఎకరాల పొలం ఉన్నదని.. అందులో కొంత పట్టా, లావణి ఉన్నదని.. ఇంకా అప్పులు రూ. ఐదు లక్షల వరకు ఉన్నాయని.. వాటిని తీర్చడం కష్టసాధ్యంగా మారిందని కన్నీరు పెట్టుకున్నది.

### భూమి విషయంలో పురుగుమందు తాగి..


భర్త ఫొటో ముందు దీనంగా ఉన్న మాణెమ్మ

వికారాబాద్, మార్చి 7 : వికారాబాద్ పట్టణంలోని మద్గుల్ చిట్టెంపల్లికి చెందిన కుమ్మరిపల్లి జంగయ్య(50), మాణెమ్మలకు ముగ్గురు కుమార్తెలున్నారు. ఇద్దరివి వివాహాలు కాగా.. చిన్న కూతురు పావని ఉన్నది. కాగా జంగయ్య, మాణెమ్మలు వ్యవసాయంతోపాటు కూలీ పనులు చేసుకుంటూ జీవించేవారు. వారికి నాలుగు ఎకరాల భూమి ఉన్నది. అందులో రెండు ఎకరాల పట్టా భూమి ఉండగా మరో రెండు ఎకరాల పొలం వారి పేరు నుంచి మిస్సైంది. ఈ విషయమై జంగయ్య తీవ్ర మనోవేదనకు గురై 23 మార్చి 2024లో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి మృతితో కుటుంబం కష్టాల్లో కురుకుపోయింది. ఇంటర్ పూర్తి చేసిన చిన్న కుమార్తె ఉన్నత విద్యాభ్యాసం చేయలేక ఇంట్లోనే ఉంటున్నది. మాణెమ్మ కూలీ పనులు చేస్తూ పోషిస్తున్నది. ఉన్న ఇల్లు శిథిలావస్థకు చేరింది. అందులోని ఓ దూలం విరిగి కూలేందుకు సిద్ధంగా ఉన్నది. దీంతో వారు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. ప్రభుత్వం నుంచి మాకు ఎలాంటి సాయం అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


కూలేందుకు సిద్ధంగా ఉన్న మాణెమ్మ ఇంట్లోని దూలం

### బోర్లు తవ్వి అప్పుల పాలై..


కుమారుడితో యాదయ్య భార్య అంజమ్మ (ఫైల్)

దోమ, మార్చి 7 : మండలంలోని అయినాపూర్ గ్రామానికి చెందిన బ్యాగరి యాదయ్య (35) అప్పుల బాధ భరించలేక ఫిబ్రవరి 19, 2025న తన పొలంలో ఉన్న చింత చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. యాదయ్యకు భార్య అంజమ్మ, కుమార్తె సంతోష, కుమారుడు అరవింద్‌తో వృద్ధులైన తల్లిదండ్రులు ఉన్నారు. ఉన్న కొద్దిపాటి పొలంలో వ్యవసాయం చేసుకుని జీవిద్దామని రూ. రెండు లక్ష ల వరకు అప్పులు చేసి బోరుబావులు తవ్వించాడు. అంతే కాకుండా ఓ బ్యాంకు నుంచి రుణాన్ని కూడా తీసుకున్నాడు. వాటిని తీర్చేమార్గం లేక ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని భార్య అంజమ్మ తెలిపింది. అతడు లేకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని.. వృద్ధులైన అత్తామామలకు మందులు తీసుకొచ్చేందుకు కూడా డబ్బుల్లేవని ఆవేదన వ్యక్తం చేసింది. కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాయని.. అప్పు లు ఎలా తీర్చాలో అర్థం కావడంలేదని కన్నీరు మున్నీరైంది. రైతుబీమాకు అవసరమైన పత్రాలను అధికారులకు ఇచ్చినా.. ఇప్పటివరకు రాలేదన్నారు. అధికారులు స్పందించి త్వరగా వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేసింది.

**ఎల్ఐసీ వారు మరింత సమాచారం కావాలన్నారు..**

గత నెలలో ఆత్మహత్యకు పాల్పడ్డ అయినాపూర్ గ్రామానికి చెందిన బేగరి యాదయ్యకు రైతుబీమా ఇంకా క్లయిమ్ కాలేదని దోమ మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్‌రావును సంప్రదించగా..ఎల్ఐసీ అధికారులు ఇంకా సమాచారం కావాలని అడిగారని.. ఈ విషయమై వికారాబాద్ జిల్లా వ్యవసాయ అధికారితో మాట్లాడినట్లు ఆయన చెప్పారు. వారు పూర్తి వివరాలు పంపించగానే త్వరలోనే క్లయిమ్ అవుతుందన్నారు.

### అనాథలమయ్యాం..
## ఆదుకోండి

యాలాల, మార్చి 7 : మండలంలోని కమాల్‌పూర్ గ్రామానికి చెందిన గోరేపల్లి శేఖరప్ప అప్పుల బాధ భరించలేక పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా.. అతడికి భార్య నర్సమ్మ, ఇద్దరు కొడుకులు ఆనంద్, అరవింద్ ఉన్నారు. తన భర్త మూడు నెలల కిందట మృతి చెందడంతో కుటుంబ భారం మొత్తం తనపైనే పడిందని.. కూలీ పనులు చేస్తూ పిల్లలను పోషిస్తున్నట్లు వివరించింది. నా భర్త పేరున ఎకరం, నా పేరున 19 గుంటలు భూమి ఉన్నదన్నారు. శేఖరప్ప మృతి చెందిదే ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదు. రైతుబీమా వస్తదని చెప్పారు. భర్తతో మృతితో అనాథలమ య్యామని.. ప్రభుత్వం స్పందించి మమ్మల్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.


తన ఇంటి ముందు దిగాలుగా కూర్చున్న గోరేపల్లి నర్సమ్మ(మృతుడు గోరేపల్లి శేఖరప్ప భార్య)


ఇబ్రహీంపట్నం : పరీక్ష ముగియగానే డీసీఎంలో వసతిగృహానికి వెళ్తున్న విద్యార్థినులు

### ప్రత్యేక బస్సు తూచ్..
## ప్రైవేట్ వాహనమే దిక్కు

- కస్తూర్బా గాంధీ విద్యార్థినులను ఇంటర్ పరీక్షా కేంద్రానికి డీసీఎంలో తరలిస్తున్న అధికారులు
- ఇబ్బందిపడుతున్నామంటున్న స్టూడెంట్స్

ఇబ్రహీంపట్నం, మార్చి 7 : ఇంటర్ ప్రథమ, ద్వితీయ ఏడాది వార్షిక పరీక్షలు రాసేందుకు విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో పలు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ సెంటర్లలో ఇబ్రహీంపట్నం కస్తూర్బాగాంధీ, సోషల్‌వెల్ఫేర్‌తోపాటు పలు కళాశాలలకు చెందిన విద్యార్థినీవిద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. కాగా, కస్తూర్బాగాంధీ విద్యార్థినులకు ఇబ్రహీంపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెంటర్ పడింది. దీంతో వారిని పరీక్షలు ప్రారంభమైన రోజు నుంచి డీసీఎంలోనే హాస్టల్ నుంచి పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లి ఎగ్జామ్ పూర్తి కాగానే తిరిగి వసతిగృహానికి తరలిస్తున్నారు. ప్రత్యేక బస్సును ఏర్పాటు చేస్తామని చెప్పిన అధికారులు.. తమను ప్రైవేట్ వాహనంలో తరలించడంతో తీవ్ర ఇబ్బందులు గురవుతున్నామని విద్యార్థినులు పేర్కొంటున్నారు.


పులుసుమామిడి పల్లెప్రకృతి వనంలో ఎండిపోయిన మొక్కలు

## పచ్చదనం కనుమరుగు

**నీరు లేక ఎండిపోయిన పులుసుమామిడి పల్లెప్రకృతి వనంలోని మొక్కలు**

వికారాబాద్, మార్చి 7 : గ్రామాల్లో రోజురోజుకూ పచ్చదనం కనుమరుగ వుతున్నది. ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణం అందాలనే సదుద్దేశంతో గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతి గ్రామంలోనూ పల్లె ప్రకృతి వనాలను ఏర్పా టు చేసి వాటి ఆలనాపాలన చూసుకున్నది. దీంతో పచ్చని మొక్కలు, చెట్లతో అందరినీ ఆకట్టుకున్నాయి. అయితే.. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో గ్రామాల్లో పాలన గాడి తప్పింది. మండలంలోని పులుసుమామిడి గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనంలో నీరు లేక ఉన్న చెట్లన్నీ ఎండిపోయాయి. గతంలో పంచాయతీ ట్యాంకర్ ద్వారా పల్లె ప్రకృతి వనంలోని ప్రతి మొక్కకూ నీటిని అందించే వారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో నిధుల్లేకపోవడంతో వాటి నిర్వ హణ కొరవడింది. పంచాయతీ ట్రాక్టర్ మరమ్మతులు చేయించకపోవడంతో అది మూలకు చేరింది. ఇకనైనా అధికారులు స్పందించి పల్లె ప్రకృతి వనంలోని మొక్కలను నీరందించి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.